విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 2, నవంబర్ 2023

రైతు ప్రభుత్వమన్నాడు.. నిలువునా ముంచుతున్నాడు

- నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రాలు
-తక్షణమే కరవు సహాయక చర్యలు చేపట్టాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం : జిల్లాలో కరువు తీవ్రంగా ఉందని వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో ఆపార్టీ నాయకులతో కలసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 31 మండలాల్లో కరువు తీవ్రంగా తాండవిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 28 మండలాలు మాత్రమే ప్రకటించడం సరికాదన్నారు. ఉరవకొండ ప్రాంతంలో మిరప పంట పూర్తిగా దెబ్బతిని లక్షల రూపాయల నష్టం జరిగిందని ఏకరువు పెట్టారు.జిల్లాకు రావాల్సిన నీటి కేటాయింపులు రావడం లేదని,కాలువ ఆధునీకరణ పనులు చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.కర్ణాటకలో తుంగభద్రపై అప్పర్ భద్రా ప్రాజెక్టు నిర్మిస్తే ఎపికి చుక్క నీరు అందదని దీంతో రాయల సీమ ఎడారి కాబోతోందని తెలిసినా సీఎం జగన్ నోరు మెదపకుండా ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.బిజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న దుర్మార్గపు చర్యలను సీఎం జగన్ గుడ్లప్పగించి చూడటమే గాని ప్రశ్నించలేని దుస్థితిలో ఉన్నాడని విరుచుకు పడ్డారు. కృష్ణా డెల్టా ప్రాంతంలో ఏడాదికి మూడు పంటలు పండించే వారని, ఈ ఏడాది కృష్ణా డెల్టా పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కృష్ణా జలాల పునః పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి బీజేపీ ప్రభుత్వం ఏపీని ఎడారిచేయబోతోందని అసహనం వ్యక్తం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 811 టిఎంసిలు కేటాయింపులున్నాయని అందులో ఏపికి 512, తెలంగాణకు 299 టిఎంసిల నీరు కేటాయించారని గుర్తు చేశారు.జిల్లాలో 6 లక్షల ఎకరాలకు సాగుతాగు నీరు అందించి సస్యశ్యామలం చేసే హంద్రీ నీవా సుజల స్రవంతి పథకాన్ని జగన్ ప్రభుత్వం సరైన రీతిలో అమలు పరచడం లేదని ఏకరువు పెట్టారు. లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ నేడుమాట తప్పి రాయల సీమ ద్రోహిగా మారాడని విరుచుకుపడ్డారు. సీపీఐ చేసిన పోరాటంతోనే జిల్లాలో కరువు మండలాలను ప్రకటించారని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు పాత ఋణాలు మాఫీ చేసి కొత్త రుణాలను ఇవ్వాలన్నారు. కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పిలిపించి కరువు పరిస్థితులను ప్రత్యక్షంగా చూపించాన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యవర్గ సభ్యులు నారాయణ స్వామి,పద్మావతి పాల్గొన్నారు.

సీపీఎం నాయకులపై పోలీసుల దౌర్జన్యం దారుణం

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: ఇల్లులేని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిశలు ఏర్పాటు చేసుకుని బతుకులీడుస్తుంటే పోలీసు బలగాలు మోహరించి జెసిబిలతో గుడిసెలు కూల్చివేయడం దుర్మార్గమని ఇదేమిటని ప్రశ్నించిన సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఇతర నాయకులను అరెస్టు చేయడం పోలీసుల దౌర్జన్యానికి నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. బుధవారం మీడియాకు వేరు వేరుగా ప్రకటన విడుదల చేశారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ పేద ప్రజలు వేసుకున్న గుడిసెలను పోలీసులు, రెవెన్యూ అధికారులు జెసిబిలతో తొలగించడం వైసిపి దౌర్జన్య పాలనకు నిదర్శనమన్నారు. పేద ప్రజల పక్షాననిలిచి పోరాడిన సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఇతర నేతలపై లారీ ·ఛార్జీకి పాల్పడి అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గం అన్నారు. ఉన్నతాధి కారులు స్పందించి గుడిసెలు పోగొట్టు కున్న నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటుకలపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి వైసీపీ కార్య కర్తగా వ్యవహరించి కమ్యూనిస్టులపై దౌర్జన్యానికి దిగారన్నారు. దళిత నాయకురాలు ఎమ్మెల్యేగా ఉన్న శింగణమల నియోజకవర్గంలోనే దళిత, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు అన్యాయానికి గురువుతుంటే జగన్ ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. సీఐ నరేంద్ర రెడ్డి క్షమాపణ చెప్పి కేసులు ఎత్తి వేయాలని కోరారు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర–యాడికి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని యాడికి ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి సూచించారు యాడికి మండల పరిధిలోని వేములపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారము చేయాలని సూచించారు, అదేవిధంగా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, డయల్ 100, దిశ యాప్ మొదలైన వాటిపై అవగాహన కల్పిస్తూ విద్యార్థినిలకు ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరిగిన తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చంద్రబాబుకు వచ్చింది మధ్యంతర బెయిలే

విశాలాంధ్ర- అనంతపురం: చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి తెలిపారు. అయితే టీడీపీ నేతలు నిజం గెలిచిందది అంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం జిల్లా వైసీపీ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏ ఖైదీకయినా అనారోగ్య కారణాలు ఉంటే న్యాయస్థానాలు బెయిల్ ఇస్తాయని.. చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందన్నారు. కంటి చికిత్స కోసం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు పాత్ర ఉందని,. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ కీలకంగా ఉన్నారని, అయితే ఆయన్ను విదేశాలకు పంపించి విచారణకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు.

అదనపు ఫీజుల వసూళ్లపై చర్య చేపట్టాలి

నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు..ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ : జిల్లాలో పదవ తరగతి పరీక్షకు సంబంధించి అదనపు ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసం స్థలపై చర్యలు చేపట్టాలని ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ నాగరాజుకి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళాయి స్వామి మాట్లాడుతూ.. కరువు కాటకాలకు నిలయంగా నిలిచిన అనంతపురం జిల్లాలో ఫీజుల దోపిడీ యథేచ్ఛగా సాగడం బాధాకరం అన్నారు. పదవ తరగతి పరీక్ష ఫీజు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ.125లు ఉండగా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులు ఒక్కో విద్యార్థితో రూ.500 నుంచి రూ.600లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాసంవత్సరం ప్రారంభం మొదటిలోనే విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్కూల్,టెక్నో సిబ్యాచ్ ఐకాన్, కొస్పర్క్ లాంటి కోర్సులు ఏర్పాటు చేసుకొని లక్షల రూపాయలు దోపిడీ చేశారని తెలిపారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఉమా మహేష్, జిల్లా ఉపాధ్య క్షులు వంశీ, నగర నాయకులు ఆనంద్, విశ్వనాథ్, కార్తిక్ పాల్గొన్నారు.

లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర–యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. కమలపాడు గ్రామానికి చెందిన ఇంజెడు సంకేపల్లి వెంకట లక్ష్మమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజెడు సంకేపల్లి శ్రీనివాసులురెడ్డి మహేందర్‌రెడ్డి,వైష్ణవి, లక్ష్మి పాల్గొన్నారు.

అధికార పార్టీ అండదండలతో భూకబ్జా

విశాలాంధ్ర - నార్పల: అధికార పార్టీ అండదండలు చూసుకొని భూకబ్జాదారులు చెలరేగుతున్నాయని బిబిఎస్ వ్యవస్థాపకులు రామాంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గాంధీ కూడలిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు నిరుపేద కుటుంబాలను చూసి భూములు కబ్జా చేస్తున్నారని వాపోయారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం నందు హరిజన నారాయణ సర్వే నెంబర్ 275/8 భూమి కబ్జా చేసిన వారిపై సింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా సంఘాలను కలుపుకొని కరపత్రాలు పంచుతామని తెలిపారు. కల్లూరు ఆదెన్న కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం నియోజవర్గ సహాయ కార్యదర్శి మారుతి, నార్పల మండల కార్యదర్శి రాజుగారు, బ్రహ్మ, మంజునాథ్ పాల్గొన్నారు.

కొర్రకోడు వైసీపీ నాయకుడు మృతి

విశాలాంధ్ర–కూడేరు: కూడేరు మండలం కొర్రకోడు గ్రామ వైస్సార్సీపీ నాయకులు, రేషన్ షాప్ డీలర్ బచ్చలయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సంతాపాన్ని ప్రకటించారు. ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు తుప్పటి హరీష్, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, పిఏసీఎస్ చైర్మన్ గంగాధర్ బచ్చలయ్య నివాళులర్పించారు.

ఉదయం సమయంలో రైతులకు విద్యుత్ సరఫరా చేయాలి

విశాలాంధ్ర–ఉరవకొండ: విడపనకల్లు మండలంలో రైతులకు అనుకూలమైన ఉదయం వేళల్లో 8 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పవతి, జడ్పిటిసి సభ్యులు హనుమంతు విద్యుత్ అధికారులకు తెలిపారు. గడేకల్లు తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన మిరప, పత్తి, కంది తదితర పంటలకు విద్యుత్ సక్రమంగా లేకపోవడం వల్ల రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే స్పందించి బుధవారం విడపనకల్లు కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం 10 వరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు విద్యుత్ శాఖ అధికారులు సరేఅన్నారు. జడ్పిటిసి సభ్యులు హనుమంతు, వైసిపి నాయకులు భీమిరెడ్డి, సర్పంచులు ఉమాశంకర్ దేవరాజు, గడేకల్ రైతులు పాల్గొన్నారు.

నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: నెట్‌బాల్ అంతర్ జిల్లా స్థాయి పోటీలు ప్రభుత్వ హైస్కూల్ న్యూ టౌన్‌లో బుధవారం నిర్వహించారు. నెట్ బాల్ లోయు 14 మంది విద్యార్థినిలు, 17 విద్యార్థులు ఎంపికయ్యారని అనంతపురం జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ బి సుగుణమ్మ, సత్యసాయి జిల్లా సెక్రెటరీ అంజన్న, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు శశిధర్ ,సంతోష్, అఖిల్, వినయ్ కుమార్, సందీప్ రావు, శశాంక్, కరుణ దేవరాజ్, శ్రీకాంత్, రూపేష్, బాబా, మహబూబ్, ప్రవీణ్, బాలికలు మనుష, దీపిక, క్రాంతి, సృజన, అమల, మధులత కుమారి,నవ్య, చరిత, హారిక, గీత, గీతారెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.

చంద్రబాబుకు బెయిలు రావడంతో ప్రజల్లో ఆనందం

- మాజీమంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర- రాప్తాడు: మాజీ సీఎం చంద్రబాబు 53 రోజులు రాజమండ్రి జైల్లో అక్రమ నిర్బంధంలో ఉండి బయటికి రావడంతో ప్రజల్లో ఎక్కడ చూసినా ఆనందం కనిపిస్తోందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండలం గంగలకుంట గ్రామంలో బుధవారం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ఎంత లబ్ధి జరుగుతుందన్నది తెలియజేశారు. చంద్రబాబు ఎంతో దూరదృష్టితో ఈ పథకాలను తీసుకొచ్చారని ఆయన ఒక్కసారి హామీ ఇచ్చారంటే అన్ని ఆలోచించి ఇస్తారని ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందని వ్యాఖ్యానించారు. ఈసారి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్ష అన్నిచోట్ల కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీన, సర్పంచ్ సాకే తిరుపాలు, కురుబ సాధికారత రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ,కిష్ట, రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, సత్తి పాల్గొన్నారు.

తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రం

విశాలాంధ్ర -జెఎన్‌టియుఏ: తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రరాష్ట్రం సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు అని ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్దన్,రెక్టార్ ఆచార్య ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ పేర్కొన్నారు.బుధవారం పరిపాలన భవనంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్ర పటాలకు ఉపకులపతి, రెక్టార్, రిజిస్ట్రార్, డైరెక్టర్లు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఉపకులపతి మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న ఆంధ్రప్రాంతాన్ని వేరుచేసి ప్రత్యేక రాష్ట్రంగా 1953 అక్టోబరు 1న ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.అరుణ కాంతి, యూనివర్శిటి డైరెక్టర్లు వి.సుమత, బి.ఈశ్వర్‌రెడ్డి, జి.వి. సుబ్బారెడ్డి, ఆచార్య బి.దుర్గా ప్రసాద్, ఆచార్య పి.సుజాత, ఆచార్య వి.బి.చిత్ర, ఆచార్య సి.శోభా బిందు, ఆచార్య ఎ.సురేష్ బాబు పాల్గొన్నారు.

బాబుకు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర–కదిరి: బాబుకు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. బుధవారం పట్టణంలో 24వ వార్డులో ప్రతి ఇంటి తలుపుతట్టి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీమేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరిస్తూ బాబుతో నేను కరపత్రాలను పంచి పెట్టారు. చంద్రబాబునాయుడు పై అక్రమ కేసులు పెట్టి నిర్ధాక్షణంగా అరెస్ట్ చేసి వైసిపి ప్రభుత్వం చేస్తున్న కక్ష పూరిత రాజకీయాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పేద బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకలు పెట్టి నేటికీ ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకొన్నారన్నారు. వైకాపా ఒక్క ఛాన్స్ అంటూ అనేక హామీలిచ్చి అధికారం చేపట్టాక అన్ని హామీలు బంగాళాకాతంలో కలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, 24వ వార్డు కౌన్సిలర్ ఇంచార్జి ఆల్ఫా ముస్తఫా, క్లస్టర్ ఇంచార్జి రెడ్డిబాషా, బాబావలి, టీడీపీ నాయకులు కొలిమి అమీన్, భాస్కర్, పీరా, హైదర్, ఖతాబ్,కొలిమి మున్న, ఎజాజ్, హిదాయతుల్లా, ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాథ్, మహేంద్ర పాల్గొన్నారు.

పేకాటపై ఉక్కు మోపుతా...

విశాలాంధ్ర–శెట్టూరు: నూతన ఎస్సై రాంభూపాల్ పదవీ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై వచ్చాను తెలిపారు. పోలీస్ సిబ్బంది ఆయనకు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మీడియాతో మాట్లాడుతూ మండలంలో మట్కా, బెట్టింగ్ అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యనిషేధం చేయకుండా మహిళల రక్తాన్ని పీల్చుతున్నాడు

టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు ‌శివబాల

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: నన్ను సీఎంను చేయండి నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తానని, మద్యనిషేధం అమలు చేస్తానని, విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని నమ్మబలికి ఓట్లు దండుకున్న వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టి వాటి ధరలు విపరీతంగా పెంచి రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడని టీడీపీ మహిళా నాయకురాలు శివబాల, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ సంయుక్తంగా పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ అధ్యక్షతన ప్రజల ప్రాణాలు ముఖ్యమా....మద్యం మీద ఆదాయం ముఖ్యమా అనే అంశంపై మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో మద్యపాన నిషేధం ఖచ్చితంగా అమలు చేస్తానని చెప్పిన సీఎం జగన్ నేడు విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్ముతున్నాడని మండిపడ్డారు. మద్యం అమ్మకాలతో కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని ఆంధ్రప్రదేశ్ ని మద్యాంధ్రప్రదేశ్ గా మార్చాడని సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజల రక్తాన్ని పీల్చుతున్నాడని ఏకరువు పెట్టారు. రాష్ట్రంలో కల్తీ మద్యం తో 90 శాతం మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి ఆదాయం తప్ప ప్రజలు ప్రాణాలు అక్కర లేదా అంటూ సూటిగా ప్రశ్నించారు.ఈ నెల 17,18,19 న జరిగే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభల్లో ఎపి ని మద్యంధ్రప్రదేశ్ గా మార్చిన జగన్ అరాచక పాలనపై చర్చించి భవిషత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధం ఎపి చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య,మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, కోశాధికారి రామాంజనమ్మ, నగర అధ్యక్ష కార్యదర్శులు జానకి,కుర్షిద, సహాయ కార్యదర్శి యశోద, కమ్మక్క, లక్ష్మీదేవి,కవిత, శాంతకుమారి, మమత, ప్రమీల, నాగములమ్మ, రోషణ, ముంతాజ్, సకినా, రజియాబాద్ పాల్గొన్నారు.

శింగనమలలో తెలుగుతమ్ముళ్ల విజయోత్సవాలు..

విశాలాంధ్ర–శింగనమల: నారా చంద్రబాబు నాయుడుకు మద్యంతర బెయిల్ మంజూరు కావడంతో శింగనమల మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ జిల్లాఅధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుకు 53 రోజుల తర్వాత బెయిల్ మంజూరు చేయడం ఈరోజు హర్షించదగ్గ విషయమని, త్వరలో నే చంద్రబాబు నాయుడు మచ్చలేని నాయకుడుగా వచ్చి 2024లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ఆనందం వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ ముంతా వెంకటేష్, జడేజా, నన్నే సాబ్, గుర్రప్ప రాజశేఖర్, జిల్లా బీసీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి లోలూరు నారాయణస్వామి,ఎస్సీసెల్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ మొండి పోగుల ఎరిస్వామి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు దాల్ వీరనారాయణ, మట్లగొంది పుల్లయ్య, రమేష్ ,శింగనమల సుధాకర్ పాల్గొన్నారు.

అనారోగ్య కారణాలతో చంద్రబాబుకు మధ్యంతర బెయిలే ..

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

విశాలాంధ్ర–రాప్తాడు: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకు కేవలం అనారోగ్య కారణాల దృష్ట్యా హైకోర్టు కండీషన్ బెయిల్ మాత్రమే ఇచ్చిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. అనంతపురంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయం గెలిచిందని చెప్పే టీడీపీ వారిని అడుగుతున్నా.. న్యాయం గెలిచిందా? రోగం గెలిచిందా అని ప్రశ్నించారు. కండీషన్ బెయిల్‌పై విడుదల కావడంతో టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తూ బాణసంచాలు కాల్చుకున్నారు. ఇంకా కొందరైతే పొట్టేళ్ల నరకడం, జంతు బలి చూస్తే సభ్యసమాజం తలదించుకునేలా హేయమైన చర్యలకు పాల్పడడం చాలా బాధాకరం అన్నారు. వయసు రీత్యా అనేక జబ్బులు ఉన్న చంద్రబాబుకు మానవతా దృక్పథంతో కేవలం చికిత్స కోసమే కండీషన్ బెయిల్ ఇచ్చారు. బెయిల్ అంశంలో ఎక్కడా కూడా కేసు పూర్వపరాలు గురించి ప్రస్తావించలేదని.. గుర్తు చేశారు.

టిడిపి శ్రేణులు విజిల్స్ వేయడం, తట్టాలు, స్పూన్లతో సౌండ్లు చేయడం, కొవ్వొత్తుల ర్యాలీ చేయడం, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేయడం తదితర విచిత్రమైన విన్యాసాలను నారా లోకేష్ ఆదేశాలతో 54 రోజుల పాటు బలవంతంగా నిరసనలు తెలిపారన్నారు. ఎంపీ మాధవ్ వ్యాఖ్యలను టిడిపి వాళ్లు వక్రీకవరించారని... జగన్ మళ్లీ సీఎం అవుతారని దీంతో చంద్రబాబు రాజకీయంగా చనిపోతారని, ఆయనకు ఉన్న జబ్బుల రీత్యా మృతి చెందుతాడని మాట్లాడి ఉండొచ్చు. అంతేకాని మేమైతే చంద్రబాబు ఇంకో 15 ఏళ్లయినా సంపూర్ణంగా బతకాలని కోరుకుంటున్నా మన్నారు. ప్రజల్ని మోసం చేయడంలో సిద్ధహస్తుడు ప్రతిపక్ష నేతగా ఉన్నంతకాలం, చెప్పిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్న జగన్ ని ప్రజలు గెలిపిస్తూ ఉంటారన్నారు.

వివాహానికి ఆర్థిక సహాయం..

విశాలాంధ్ర–శింగనమల: చెన్నంపల్లి గ్రామంలో నివాసంఉంటున్న మారుతి కుమారుడు ప్రవీణ్ వివాహానికి నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో. మల్లికార్జునరెడ్డి అంజి, రామంజి, చెన్నంపల్లి పాల్గొన్నారు.

నేను ఉన్నట్టా లేనట్టా..మహిళ ఆవేదన

విశాలాంధ్ర–పామిడి: మండలంలోని పి.కొండాపురం గ్రామానికి చెందిన సుంకమ్మ బుధవారం తాహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టింది. పది సంవత్సరాల నుండి కొండాపురంలో నివాసముంటున్న ఆధార్ కార్డు, రేషన్ కార్డు, లేవని 65 ఏళ్లు తనకు,70 సంవత్సరాలు నా భర్తకు ఉన్నప్పటికీ ఆధార్ కార్డు లేనందు వల్ల పెన్షన్ కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. కార్యాలయం చుట్టూ తిరిగినా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపన పోలేదన్నారు. ఈరోజు ఎలాగైనా తాసిల్దార్‌ని కలిసి గోడు విన్నవించుకుందాం అంటే తాహసిల్దార్ లేరు ఇక్కడున్న వీఆర్వో శ్రీకాంత్ రెడ్డి బయటికి పోండంటున్నారు. నా సమస్య పరిష్కారం ఎలా అవుతుందని, మేము భార్యాభర్త జీవించాలంటే కూలికి పోతేనే తప్ప పూట గడవని స్థితిలో ఉన్నామని, ఆధార్ కార్డ్ లేకపోతే మేము ఉన్నట్టా లేనట్టా అంటూ కన్నీరు కార్చింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల వద్దకు పాలన అంటూ సచివాలయం వ్యవస్థ తీసుకొని వచ్చిన ఇంకా చాలామందికి పథకాలు ఏమో కానీ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు కూడా లేనివారు ఉన్నారని, సచివాలయం వ్యవస్థ ఎలా పనిచేస్తుందో ఈమె పరిస్థితి చూస్తే అర్థమవుతుందని తాహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు అంటున్నారు.

పెద్దపప్పూరు పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: జిల్లాలోని పెద్దపప్పూరు పోలీసు స్టేషన్ ను ఈరోజు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ రికార్డుల నిర్వహణ, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులను లోతుగా పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలు, పోలీసు సిబ్బంది కోసం నూతనంగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నుండీ పంపిన వాటర్ డిస్పెన్సర్ నుండీ ఎలాంటి శుద్ధజలం వస్తుందో స్వయానా ఎస్పీ నీరు తాగి చెక్ చేశారు. పోలీసు స్టేషన్లకు వచ్చే పిటీషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, అనవసరంగా ఎవర్నీ పోలీసు స్టేషన్లకు పిలిపించడం చేయరాదని సూచించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే ప్రతీ రికార్డును సమీక్షించారు. అనంతరం పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇసుక... మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి, నాటు సారా తయారీ, అమ్మకం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కోరారు.

చంద్రబాబు బెయిలు ధర్మానికి తొలి విజయం

విశాలాంధ్ర–శింగనమల: టీడీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి స్కిల్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు అయిన సందర్భంగా శింగనమల మండల కేంద్రంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శింగనమల మండలకేంద్రంలో అర్, టి సి.బస్టాండ్ లోఅంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం మసూద్ స్వామి దర్గా వరకు ర్యాలీ గావెళ్ళి దర్గాలోప్రార్థనలు చేశారు, అనంతరం మెయిన్‌బజార్‌లో బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మాట్లాడుతూ తప్పుడు కేసులో 53 రోజులు జైలులో గడుపుతున్న నారా చంద్రబాబు కోర్టు ఆదేశాలతో ఉపశమనం పొందడం అనందదాయకమని చంద్రబాబు నేరం చేయక పోయినా జగన్ కేవలం రాజకీయ కక్షతోనే జైలుపాలు చేశాడని మండిపడ్డారు, చంద్రబాబు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే జగన్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు, న్యాయస్థానం నాలుగు వారాల పాటు చంద్రబాబుకి బెయిల్ మంజూరు చేయడాన్ని ధర్మానికి దక్కిన తొలి విజయంగా అభివర్ణించారు. కోట్లాది మంది ప్రజల దీవెనలు చంద్రబాబు కి తోడుగా ఉన్నాయన్నారు. త్వరలోనే సర్వోన్నత న్యాయస్థానంలో చంద్రబాబు కి సానుకూలంగా తీర్పు వెలువడి, కడిగిన ఆణిముత్యంలా మనమధ్య మెరుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 2, నవంబర్ 2023

అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి: జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయం పత్రికా సమావేశంలో అయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది రైతులు ఖరీఫ్‌లో వేరుశెనగ, కంది ఇతర పంటలు సాగు చేశారని, సకాలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోయాయన్నారు. దిగుబడి లేక పెట్టిన పెట్టుబడి రాక రైతు కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయారని తెలిపారు. పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు 25వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చెయ్యాలన్నారు. అంతే కాకుండా రబీ కింద సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చెయ్యాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వలసల నివారణ కోసం సంవత్సరానికి రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని కోరారు.

హైకోర్టు న్యాయమూర్తికి చారిత్రక పరిశోధకుడు 'లేపాక్షి' పుస్తకం అందజేత..



విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలం కరావులపల్లి గ్రామానికి చెందిన చారిత్రక పరిశోధకులు మైనా స్వామి(మైలారం నారాయణ స్వామి) రచించిన "ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర-లేపాక్షి" పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద రావుకు విజయవాడలో అందజేసినట్లు తెలిపారు. విజయనగర సామ్రాజ్యంపై మంచి పరిశోధన జరిపినందుకు న్యాయమూర్తి అభినందించారు.

పొట్టి శ్రీరాముల త్యాగఫలితమే ఆంధ్రరాష్ట్రం

విశాలాంధ్ర-పుట్టపర్తి: తెలుగు భాష మన మాతృభాష అని, తెలుగువారికోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు అన్నది అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే అని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్ చేతన్, ఏఎస్‌పి విష్ణు, జిల్లా అగ్రి బోర్డు చైర్మన్, అవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ ఏవి రమణారెడ్డి, పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, డిఆర్ఓ కొండయ్య ఆర్డీవో భాగ్యరేఖ. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మాధవ రెడ్డి పాల్గొన్నారు. ధర్మవరంనకు చెందిన జ్యోతి ఇంగ్లీష్ మీడి యం హైస్కూల్ చిన్నారుల ఆధ్వర్యంలో మా తెలుగుతల్లికి మల్లెపూదండ గేయంపై నృత్య ప్రదర్శన జరిగింది. మడకశిర ఎమ్మెల్యే ప్పేస్వామి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార చేశారని గుర్తు చేశారు. ఆయన త్యాగఫలితంగా ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం అవతరించగా 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్రరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా మారిం దన్నారు. అనునిత్యం సత్యం, అహింస మార్గాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు తపించేవారని అన్నారు. కలెక్టర్ మాట్లా డుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జాతికి చేసిన సేవలు ఎనలేవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. జిల్లా అధికారులు రానున్న రోజుల్లో కూడా మంచి ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే ఈ జిల్లాను అగ్రగామిగా నిలపాలని కోరారు. ఎస్పీ మాధవరెడ్డి త్యాగధనుల సేవల ఫలితంగానే నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి ఉపన్యాసించారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య,పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డా.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా.ఎం.టి.నాయక్, డీసీఓ కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌భాష, పట్టుపరిశ్రమశాఖ జెడి పద్మమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కాలేజీ సర్కిల్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల మురళీధర్, కోశాధికారి ఓ.వి.ప్రసాద్, కార్యదర్శి కాకుమాని విద్యాసాగర్, మున్సిపల్ కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, కోఆప్షన్ నెంబర్ రామకృష్ణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు అవినాష్, నగర సంకీర్తన బృందం చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల వనరుల కేంద్రంలో కూడా ఎంఈఓలు గోపాల్ నాయక్, రాజేశ్వరి, పార్థసారథి నగర్ కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి సచివాలయ అడ్మిన్ భాస్కర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలువేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కాయగూరల మార్కెట్ వద్ద గల నూతనంగా నిర్మించిన భవనంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. తొలుత పూజలు నిర్వహించారు. తదుపరి కొన్ని గదులను ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరాం రెడ్డి, శంషాద్ బేగం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా అద్దె భవనంలో ఉన్న సబ్‌రిజిస్టర్ కార్యాలయాన్ని ప్రజలకు అనుకూలంగా పట్టణం నడిబొడ్డున ఉన్న మార్కెట్లోకి మార్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, పెనుజూరు నాగరాజు, జిలాన్ భాషకేతా లోకేష్, గజ్జల శివ, వైసీపీ నాయకులు చాంద్ భాషా, సబ్ రిజిస్ట్రార్ రమణారావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణలు ఉపయోగకరం

విశాలాంధ్ర-ధర్మవరం: స్వయం ఉపాధి శిక్షణలు అందరికీ జీవనోపాధిగా ఉపయోగపడతాయని శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి, బైరేడ్ కంపెనీ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య పాత సత్రంలో మగ్గం, జర్దోసిలపై బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మురళీధర్, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు పోరాళ్ళ రాగిణి, సిల్క్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ నిమ్మి పాల్గొని ఈనెల 1వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు 37 రోజులు పాటు శిక్షణ ఉంటుందని, ఈ కాలంలో భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకొని విజయ పరంపరలో ముందడుగు వేయాలని తెలిపారు. తొలుత పుట్టపర్తి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో పట్టణ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ శ్రీ సత్య సాయి భజన మండలి కన్వీనర్ సాంబశివ, అనూష శిక్షకురాలు, విద్యాసాగర్, శేషాచారి, రామాంజనేయులు, అరుణ, రామకృష్ణ పరందామా పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష..

మున్సిపల్ ఛైర్మన్ కాచర్ల లక్ష్మి

విశాలాంధ్ర-ధర్మవరం: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్షగా లభించిందని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంషాద్ బేగం, వేముల జయరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్టణంలోని ఎర్రగుంట పార్థసారథి నగర్-2 సచివాలయంలో, శారదానగర్ సచివాలయంలో, ఎస్బిఐ కాలనీ సచివాలయంలో వేరువేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా మారిందని, సర్వేలో జరిపిన ప్రకారం ప్రజలందరికీ ఆరోగ్య సమాచారాన్ని కూడా సేకరించి వారికి తగ్గ వైద్య చికిత్సలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ గా ఆనందు, కిరణ్ కుమార్, శివ వ్యవహరించారు. అనంతరం మూడు సచివాలయాల్లో 785 మంది రోగులకు వైద్య చికిత్సలతో పాటు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. తదుపరి కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప 298 మంది కంటి రోగులకు వైద్య చికిత్సలు అందించి 53 మందికి ఉచితంగా అద్దాలను చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్, ఆయా వార్డుల కౌన్సిలర్ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమములో కౌన్సిలర్లు కత్తే ఆదిలక్ష్మి, మేడాపురం వెంకటేశు, శంకర తేజస్వర, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ ఎస్ఐగా ఆర్.విజయ్ కుమార్ నాయక్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్కు రూరల్ ఎస్సైగా ఆర్. విజయ్‌కుమార్ నాయక్ బుధవారం పోలీస్ స్టేషన్లో పదవీ బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఉన్న ఎస్సై.ప్రదీప్ కుమార్ శ్రీ సత్యసాయి జిల్లా ఎస్బి- శాఖకు బదిలీగా వెళ్లారు. విజయ్ కుమార్ నాయక్ శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ నుండి సాధారణ బదిలీగా ధర్మవరంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సై విజయ్ కుమార్ నాయక్‌కు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు అందు బాటులో ఉండి చట్టపరంగా అందరికీ న్యాయం జరిగేటట్లు చూస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య సలహాలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: స్థానిక పివియస్ పాఠశాల ప్రాథమిక విద్యార్థులు బుధవారం ముదిగుబ్బ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్యశాలలోని డాక్టర్లు పిల్లలకు ఆరోగ్యాన్ని, ఎలా సంరక్షించుకోవాలి అన్న అంశం మీద విలువైన సూచనలిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతను చిన్నవయసు నుంచే అలవర్చుకోవాలని, కూరగాయలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేందర్, ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది, పి వీఎస్ పాఠశాల ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సకు తరలిన రోగులు

విశాలాంధ్ర -అగళి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల 27న బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో వైద్యాశిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. 250 మందికి పరీక్షలు నిర్వహించి 102 మందికి శాస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని బుధవారం ప్రత్యేక బస్సులో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. శాస్త్ర చికిత్స తోపాటు భోజన సౌకర్యం కల్పించి మళ్లీ అగళికి చేరావేస్తారని జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు.

ఆయన త్యాగ ఫలితమే ఏపీ ఆవిర్భావం

విశాలాంధ్ర-కొత్తచెరువు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు మహమ్మద్, రామా చారి, రమేష్, సుబ్రహ్మణ్యం, అసిఫ్ ఉల్లా, అటెండర్ మునీరు పాల్గొన్నారు.

బైకుల చోరీ నిందితుల అరెస్ట్..

విశాలాంధ్ర-కదిరి: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల వరుసగా మోటార్ సైకిల్ లు దొంగతనాలు చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పట్టణ సీఐ నారాయణరెడ్డి, ఎస్సై బాబ్జాన్ పంపినట్లు తెలిపారు. ఉదయం రాయచోటి రోడ్లో వాహనాలను తనిఖీ చేతున్న సమయంలో షేక్ అఫిసుల్లా (19)ఆదిల్లా (21)ఇద్దరిని విచారించి వారి వద్ద నుండి 7 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించమన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో రోడ్డు నిర్మాణం

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు ..

విశాలాంధ్ర-గోరంట్ల: పెనుకొండ నియోజక వర్గ శాసన సభ్యులు మాలగుండ్ల శంకర నారాయణ ఆదేశాల మేరకు గోరంట్ల మండలంలోని గంగంపల్లి పంచాయతీ నందు గల దిగువ గంగంపల్లి తాండ నందు మండల పరిషత్ సాధారణ నిధుల నుండి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభం చేశారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల జడ్పిటిసి పాలే జయరామ్ నాయక్, సర్పంచ్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపిడిఓ రఘునాథ్ గుప్తా ,శ్రీనివాసనాయక్, వాసుదేవ రెడ్డి, పరిపాలన అధికారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

విశాలాంధ్ర-గోరంట్ల: స్కూల్ గేమ్స్ అండర్ 14విభాగంలో బాల్ బాడ్మింటన్ పోటీలకు, గోరంట్ల పట్టణంలో ని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యా ర్థిని లు రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాదిక్ వలి తెలిపారు. బుధ వారం పాఠశాల ప్రధానోపాధ్యా యులు సాదిక్ వలి క్రీడా ఉపాధ్యాయురాలు యమున, సూర్యనారాయణమ్మ లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ...తమ పాఠశాలకు చెందిన అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ కు ఏడవ తరగతి విద్యార్థిని హేమశ్రీ,, సాఫ్ట్ బాల్ అండర్ 17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని సాహిత్య మరియు హాసిని, బేస్ బాల్ కు పదవ తరగతి విద్యార్థిని హిమ వర్షిత ఎంపికయ్యారని, ఎంపికైన విద్యార్థినిలు నవంబర్ 4 నుంచి 6 తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో, సాఫ్ట్ బాల్ ఒంగోలులో పాల్గొంటారని తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు అభినందించారు.

బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలోని 11,12, వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలసి ప్రారంభిం చిన సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికె. పార్థసారథి అనంతరం పార్థసారథి మాట్లాడుతూ ఈ కార్యక్రమం బుధవారం నుంచి 45 రోజులపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని గ్రామాలలో నిర్వహిస్తామని, తెలియజేస్తూ వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారికి ఏడాది రూ.15 వేలు ఆడబిడ్డనిధి క్రింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500 రూపాయలు, దీపం పేరుతో ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 20 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏడాదికి 20000 ఆర్థిక సాయం తదితర పథకాలతో ప్రతి ఇంటికి ఏడాదికి రూ. 1,22,000ల ఆర్థిక సాయం చేయబోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికుల పట్ల బాధ్యతగా వ్యవహరించండి

విశాలాంధ్ర-లేపాక్షి: నిత్యం పని అవసరాల కోసం ఆటోలలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల అప్రమత్తంగా ఉండి బాధ్యతగా వ్యవహరించాలని ఆటో డ్రైవర్లకు ఎస్ఐ గోపి సూచించారు. బుధవారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో పోలీస్‌స్టేషన్లో నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోను నడిపే ప్రతి ఒక్క డ్రైవర్ లైసెన్స్, వెహికల్ ఇన్సూరెన్స్, పక్కా రికార్డులు ఉంచు కోవాలని తెలిపారు. అనంతరం మండల వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లతో ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడైనా కానీ అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాధ్యతగా తమ పనులు తాము చేసుకొని ప్రశాంతంగా జీవిస్తే భవిష్యత్తులో ఇలాంటి కేసుల నుండి మిమ్మల్ని తొలగించే విధంగా వ్యవస్థ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-గుడిబండ: ఎంపీడీఓ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. మండల అడ్మిషన్ ఆఫీసర్ నారాయణప్ప ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీవో భార్గవి, ఆర్డబ్ల్యూఎస్ మండల కోఆర్డినేటర్ చంద్రప్ప, టెక్నికల్ అసిస్టెంట్ మారేగౌడ్ పాల్గొన్నారు.

నేడు వరుణ యాగం..

విశాలాంధ్ర-రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోట ప్రాంతంలో వెలిసిన శ్రీ స్వయంభు జంబుకేశ్వర స్వామి దేవాలయం నందు గురువారం వరుణయాగం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం పూర్తిగా వర్షాలు పోయి రైతన్నలు అపార నష్టాల్లో ఉన్న నేపథ్యంలో సంపూర్ణంగా వర్షాలు కురిసి రైతన్నలు సుఖపడాలని కోరుతూ వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 6:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శిక్షణ

విశాలాంధ్ర-పెనుకొండ: మండల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఆరు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందికి రాగి ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అశ్వత్థ నారాయణ నాయక్, పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గడిచిన ఖరీఫ్ పంట కాలంలో రాగి పంట సాగు చేసే రైతులకు 80 శాతం రాయితీతో, నాలుగు కేజీల రాగి విత్తనం రూ.139లు అందజేశారు. ఆ వచ్చిన రాగి ధాన్యం దిగుబడిని రూ.3846 కనీసం మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయడం జరుగుతున్నది, కావున, రైతు భరోసా కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రాగి సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించి, నాణ్యత ప్రమాణాలను పాటించి, పౌరసరఫరాల శాఖ ద్వారా కొను గోలు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. రాగి పంట కొనుగోలుకు సంచులు హమాలి రవాణా ఖర్చులు ప్రభు త్వం భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌లోని ఆరు మండలాల్లో సీఎస్‌డీటీలు పౌరసరఫరాల సిబ్బంది, రైతు భరోసా శాఖ

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర -హిందూపురం: ఎంతో మంది పోరాట ఫలితంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, నేడు వారి స్ఫూర్తితో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, ఆంధ్ర రాష్ట్ర ప్రజలుగా మనం బలపడుతూ, ఈ దేశాన్ని మరింత బలపరిచేందుకు ఎన్నో అడుగులు ముందుకు వేస్తున్నామని, హిందూపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తరెడ్డి అన్నారు. హిందూపురం పట్టణంలోని చిన్న మార్కెట్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహనికి పూలమాలలు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్ పర్సన్, ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, బి బ్లాక్ కన్వీనర్ నరేష్ కౌన్సిలర్ ఆసిఫ్, నాగేంద్రమ్మ, వార్డ్ ఇంచార్జి నాగరాజు, కవిత, ఫారుక్, డైరెక్టర్ల జనార్దన్ రెడ్డి లక్ష్మీ నారాయణ, రవీంద్రుడు, కురుబ భారతి, శ్రీని వాసులు, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి..

విశాలాంధ్ర-ధర్మవరం: జిల్లాలో 32 మండలాలు ఉన్నాయని, ఇందులో 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించక పోవడం దారుణమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య, శ్రీ సత్య సాయి జిల్లా ప్రధాన కార్యదర్శి జే వి. రమణ పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తే, మిగిలిన 11 మండలాల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తక్కువ వర్ష పాతం వల్ల అప్పు చేసి సాగుచేసిన పంటల దిగుబడి రాక రైతుల జీవనం ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు సరిగ్గా స్పందించడం లేదన్నారు. ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. జాతీయ విపత్తుగా ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాని యుద్ధ ప్రాతి ప్రాతిపదికన ప్రకటించాలని తెలిపారు.

ఘనంగా అశ్వర్థ నారాయణ కళ్యాణం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కెపిటివీధిలో గల శ్రీ పంచ నాథేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమాలు ఈనెల 30వ తేదీ నుండి నవంబర్ రెండవ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఆలయ అభివృద్ధి కమిటీ వారు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవరోజు శమి నారాయణ స్వామి దేవాలయంలో నవగ్రహకళశ పూజ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ ,సుబ్రహ్మణ్యేశ్వర, అశ్వత్థ నారాయణల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శిఖర కలశ స్థాపన, ధ్వజ ప్రతిష్ట, దీక్ష హెూమాలు నిర్వహించారు. కలసస్థాపన నవగ్రహ ఆరాధన విగ్రహానికి క్షీరాభిషేకం ప్రధాన అర్చకులు మోహనస్వామి, శిష్య బృందం సుమంత్ కుమార్, లక్ష్మీపతి, రాజేష్ ఆచార్యులు, ఫణి కుమార్ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. కొత్తపాలెం హరి ప్రసాద్, కార్యదర్శి రామ శేషయ్య మాట్లాడుతూ అతి పురాతనమైన శివాలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేశామని చెప్పారు.

8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థలు బంద్

విశాలాంధ్ర-ధర్మవరం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుటకై, కడపలోనే ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని, అందుకే ఈనెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బందును నిర్వహిస్తున్నట్లు బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు పవన్, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివకుమార్, ఎస్ ఎస్ యు వై జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజా తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ అనేక త్యాగాలతో విద్యార్థి యువజన నాయకులు 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ ఈ బందును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 8వ తేదీ నాటికి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనకు సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టాలన్న ఆలోచన దుర్మార్గమైన చర్య అని తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు శివ పట్టణ నాయకులు ప్రదీప్, శీన, నగేష్, రాజశేఖర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 02,నవంబర్ 2023

దేశంలోనే మొదటి ఎయిర్ లైన్‌కు లివింగ్ హెరిటేజ్‌గా అభివృద్ధి

విశాలాంధ్ర – గోరంట్ల : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా, పాలసముద్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, పరోక్ష పన్నులు మరియు నార్కోటిక్స్ (నాసిన్) యొక్క కొత్త క్యాంపస్ రాబోతోంది, సిబిఐసి మరియు అనుబంధ ఏజెన్సీల అధికారులకు స్మగ్లింగ్ నిరోధక కార్యకలాపాలలో కెపాసిటీ బిల్డింగ్ మరియు ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గ్రౌండింగ్ చేయబడిన ఎయిర్ ఇండియా నుండి నిలిపివేయబడిన ఎయిర్‌క్రాఫ్ట్ ఎయిర్‌బస్ ఏ-321 (విటి - పిపిఎన్) కొనుగోలు చేయబడిందన్నారు. 9 అక్టోబర్ 2023న నాసిన్ కి అప్పగించబడిన డికమిషన్ చేయబడిన ఎయిర్‌క్రాఫ్ట్ విడదీయబడిందన్నారు, మరియు దాని ఫ్యూజ్‌లేజ్, రెక్కలు, ట్రైలర్‌లలో లోడ్ చేయబడిన భాగాలను రోడ్డు మార్గంలో నాసిన్ పాలసముద్రం కి రవాణా చేస్తున్నారు. మరియు అది సైట్‌లో మళ్లీ అసెంబుల్ చేయబడుతుందని సిబ్బంది తెలిపారు. ట్రయిలర్లలో లోడ్ చేయబడిన విమానం యొక్క పొడవైన ఫ్యూజ్‌లేజ్ మరియు రెక్కలు శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి పాలసముద్రం వరకు సుమారు 430 కి.మీ దూరం ప్రయాణిస్తాయని, ఇది మానవ ప్రయత్నాలకు సాక్ష్యంగా ఉంటుందన్నారు,డీకమిషన్ చేయబడిన విమానం సిబిఐసి, ఇతర దేశీయ మరియు అంతర్జాతీయ చట్ట అమలు సంస్థల అధికారులకు స్మగ్లింగ్ నిరోధక కార్యకలాపాలు మరియు దాచిన పదార్థాలను గుర్తించడంలో ఆచరణాత్మక శిక్షణ కోసం ఉపయోగించబడుతుందన్నారు, నాసిన్ పాలసముద్రం వద్ద, ఎయిర్ ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్ భారతదేశంలోని మొదటి ఎయిర్‌లైన్‌కు లివింగ్ హెరిటేజ్‌గా నిలుస్తుందని, మరియు డీకమిషన్ తర్వాత కూడా ఈ విమానం దేశానికి సేవలను అందిస్తూనే ఉందన్నారు.

బస్సు బోల్తా...తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-గోరంట్ల: ద్విచక్ర వాహనాన్ని తప్పించి పోయి అదుపుతప్పి బస్సు బోల్తా పడిన సంఘటన గోరంట్ల పట్టణ సమీపంలోని కొత్తచెరువు రోడ్డులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గోరంట్ల మండలంలోని కరావులపల్లి తండా, గుంతపల్లి, మందలపల్లి గ్రామాల నుండి పనిచేయడానికి పెనుకొండ వద్ద గల కియా అనుబంధ సంస్థ ఏ సిటీ కంపెనీకి ట్రావెల్స్ బస్సులో వెళు తుంటారు, పరిశ్రమలో పనులు ముగించుకొని దాదాపు 12 మంది ప్రయాణికులుశ్రీనివాస ట్రాన్స్పోర్ట్ బస్సులో వెళ్తున్నారు, గుమ్మయగారిపల్లి దాటగానే ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ద్విచక్ర వాహనం రావడంతో తప్పించబోయిన డ్రైవర్ పక్కకు తిప్పడంతో వంక లోకి బోల్తా పడింది, అయితే ఈ సంఘటనలో ఎవరికి ఏమి కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు, వెంటనే అందులో ఉన్న వారిని అద్దం తొలగించి బయటకి రావడంతో మరొక వాహనంలో వారిని వారి స్వగ్రామాలకు తరలించారు.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు, స్థానిక పట్టణంలోని తెలుగు తల్లి సర్కిల్ నందు తెలుగు తల్లి విగ్రహమునకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలం ఎంతోమంది పోరాట ఫలితంగా తెలుగు వారికి నవంబర్ 1న ఏర్పాటైన ప్రత్యేక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అన్నారు. నేడు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవానీ పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలుతెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక సభ్యులు సంఘ సేవకులు పాల్గొన్నారు.

వై.ఎస్.ఆర్ జీవిత సాఫల్య పురష్కారం ప్రదానం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన రాయలసీమలో మెట్ట వ్యవసాయంలో రైతులుకు మేలు చేయడం కోసం నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్న డాక్టర్ యర్రగొండ వెంకట మల్లారెడ్డికి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం వై.ఎస్.ఆర్ జీవిత సాఫల్య పురష్కారాన్ని విజయవాడలో బుధవారం అందజేసింది.రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న వారికి ప్రభుత్వ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా 2023 వ సంవత్సరంలో మెట్ట వ్యవసాయ రంగంలో విశేషంగా కృషి చేస్తున్నందుకు మల్లారెడ్డికి పురష్కారంతో సత్కరించింది. విజయవాడలో ఎ కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన పురష్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

గడువులోపు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : గడువులోపు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ లో ఉన్న ఈవీఎం గోడౌన్లో ఈవీఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఎలాంటి తప్పులు లేకుండా ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ సూపర్వైజర్ రవీంద్ర, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డీపీఓ ప్రభాకర్ రావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

విశాలాంధ్ర-అనంతపురం: మాజీ సీఎం చంద్రబాబు నాయుడు తోనే ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అన్నారు బుధవారం అనంతపురం నగరంలో భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో అనంతపురం టిడిపి అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నిధులు రైతులు ఖాతాలో జమ చేయండి



విశాలాంధ్ర-ఉరవకొండ: గుంతకల్లు నియోజకవర్గాలలో2019 సంవత్సరం నుండి "వాటర్ షెడ్ ఫారం ఫండ్స్" క్రింద రైతులు తమ పొలాల్లో పనులు చేసుకున్నారని, ఆ పనులకు సంబంధి ంచి రైతులకు ప్రభుత్వము చెల్లించాల్సిన నిధులు ఇప్పటికీ కూడా జమ చేయలేదని, వెంటనే నిధులను జమ చేయాలని వైయస్సార్ సిపి పార్టీ రాష్ట్ర యువనేత కొనకొండ్ల భీమిరెడ్డి బుధవారం విజయవాడలో వాటర్షెడ్ డెవల ప్మెంట్ డైరెక్టర్ పివిఆర్ ఎం రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.గతంలో ఉరవకొం డలో ఉన్న వాటర్షెడ్ క్లస్టర్ కార్యాలయాన్ని కళ్యాణదుర్గా నికి తరలించడం జరిగిందని కార్యాలయాన్ని తిరిగి ఉరవకొండలోనే పునరుద్ధరించాలని పేర్కొ న్నారు.యువనేత భీమిరెడ్డి విజ్ఞప్తికి డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు.

కళా ఉత్సవ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-బుక్కపట్నం: నవంబర్ 7వ తేదీన జరుగు జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలను ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నవంబర్ 7వ తేదీన నేషనల్ కౌన్సిలింగ్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ డైట్ కళాశాల నందు ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఈ పోటీలలో పది కేటగిరీలలో జిల్లా స్థాయి నుంచి ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయిలో ఎంపిక కాబడిన ప్రతిభావంతులకు ప్రథమ బహుమతిగా 25000, ద్వితీయ బహుమతి 20000,తృతీయ బహుమతి 15వేల రూపాయలు తో పాటు ప్రతిభావంతులకు నూతనపార్లమెంటు సందర్శించే అవకాశం కల్పిస్తారని కావున ప్రధానోపాధ్యాయులు పిల్లలను సంసిద్ధం చేయాలని క.జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులుఅందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మాదక ద్రవ్యాలతో ముప్పు తప్పదు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మాదక ద్రవ్యాల వాడకం వల్ల ముప్పు తప్పదని, వాటికి దూరంగా ఉండాలని బొమ్మనహాళ్ ఎస్ఐ శివ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనేక అనర్థాలు జరగడమే కాకుండా విలువైన జీవితం అంధకారం అవుతుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని విద్యార్థులను కోరారు.ఎటువంటి తప్పులు చేయబోమంటూ ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోలీసుల అమర వీరుల దినోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వాస్యరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలోకళాశాలప్రిన్సిపాల్ ఆంజినేయులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు

విశాలాంధ్ర- రాప్తాడు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలను రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బుధవారం హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనేక పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు.అనేక పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు.అనేక పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. భారత దేశం స్వాతంత్ర్యం సాధించాక ఏర్పడిన తొలి భాషాప్రయుక్త రాష్ట్రమన్నారు. తెలుగు బాష మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: డా ఈ.బి.దేవి వైద్య,ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో హెచ్ ఎం ఐ ఎస్ నోడల్ ఆఫీసర్ ల సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మాతృ మరణాల,శిశు మరణాల నివారణ, హైరిస్క్ గర్భవతుల నమోదు సేవలు, గర్భవతులకు అనీమియా పరీక్షలు సక్రమంగా నిర్వహించుట,పోషకాహారము గురించి వారికి అవగాహన కలిగించుట, పమ్మవ్య పి ఎం ఎంవి వై కి అర్హులైన తల్లులను నమోదు చేయుట, ఆసుపత్రి ప్రసవముల శాతంను పెంచుట, ఆర్ సి హెచ్ పోర్టల్ నందు గర్భవతులకు, తల్లులకు మరియు పిల్లలకు అందించిన సేవలను ఎప్పటికప్పుడు పోర్టల్ నందు నమోదు చేయుట గురించి,హెచ్ ఎంఐఎస్ పోర్టల్ నందు సక్రమముగా డేటా పొందుపరచుట గురించి సమీక్ష నిర్వహించి తగిన సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ సమేవేశములో మారుతీ ప్రసాద్ గణాంక అధికారి, గోవింద గౌడ్ ఉప గణాంక అధికారి,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, యూ పి హెచ్ సి ల హెచ్ ఎం ఐ ఎస్ నోడల్ ఆఫీసర్ లు, మలేరియా, టీబీ , డి ఏ పి సి యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-బుక్కపట్నం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.సందర్భంగా అమర్ జీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం నాయకులు విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు అబ్దుల్ రెహమాన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, ప్రశాంత్ కుమార్, నాగభూషణం, ఉపాధ్యాయ సిబ్బంది

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర - నార్పల: నార్పల మండల పరిధిలోని సిద్ధరాచర్ల సచివాలయంలో బుధవారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సాకే కుల్లాయప్ప, మహేష్ నాయుడు, లోకేష్, సురేష్, భాగ్య వాలంటీర్లు యామిని,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం



విశాలాంధ్ర-పెనుకొండ: అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగ ఫలం, ఎంతో మంది పోరాట ఫలితంగా తెలుగు వారికి నవంబర్ 1న ఏర్పాటైన ప్రత్యేక రాష్ట్రం మన ఆంధ్ర ప్రదేశ్. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం పెనుకొండ పట్టణంలోని సెంట్రల్ స్కూల్ నందు ఆనంతరం నగర పంచాయతీ, సచివాలయం 5 పరిధిలో గల సెంట్రల్ స్కూల్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ నారాయణ అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష లో అందించే వైద్య సదుపాయాలను మరియు అక్కడ ఉన్న మెడికల్ మందులను, పరికరాలు వాటి వివరాలను తెలుసుకొని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్, స్థానిక, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, వైస్ ఛైర్మన్లు , కౌన్సిలర్స్ ,కార్యకర్తలు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మధ్యంతర బెయిలే..!

విశాలాంధ్ర - శింగనమల: చంద్రబాబుఆరోగ్య పరిస్థితి దృష్ట్యా హైకోర్టు మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందని వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్ తెలిపారు.టీడీపీ నేతలు మాత్రం 'నిజం గెలిచింది' అంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు దేశంలో ఏ ఖైదీకయినా అనారోగ్య కారణాలు ఉంటే న్యాయస్థానాలు బెయిల్ ఇస్తాయని, చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందని చెప్పారు. కంటి ఆపరేషన్ కోసం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ నాలుగు వారాల పాటు మంజూరు చేసిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు పాత్ర ఉందని, ఆయనకు బెయిల్ ఇవ్వాలని దాఖలు చేసిన పిటీషన్ వాదనల సమయంలో చంద్రబాబు తరఫు న్యాయవాదులు కంటి చికిత్సను ప్రస్తావించడం వల్లే బెయిల్ వచ్చిందని తెలిపారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ కీలకంగా ఉన్నారని, అయితే ఆయన్ను విదేశాలకు పంపించి విచారణకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. మధ్యంతర బెయిల్ విషయంలోనూ రాజకీయం చేయడం సరి కాదన్నారు. నాలుగు వారాల మధ్యతర బెయిల్ గడువు ముగిశాక మళ్లీ చంద్రబాబు జైలుకు వెళ్తారని స్పష్టం చేశారు.

సమాచార హక్కు సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-ఉరవకొండ: సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా నాయకులు వ న్నూరప్ప, డాక్టర్ హరిప్రసాద్ ధ్వర్యంలో బుధవారం ఉరవకొండలో విశ్రాంతి ఉద్యోగుల భవనం నందు నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు కే.కృష్ణప్ప అధ్యక్షులు వన్నూరు సాహెబ్, ఉపాధ్యక్షులు రామకృష్ణ శివప్రసాద్, కార్యదర్శిగా కప్పట్రాల్ జాఫర్, సహాయ కార్యదర్శులుగా లాలు సాబ్, ధనంజయ, ట్రెజరర్ గా కొత్త రవి, నబిరసులు, శర్మాస్, ఎర్రి స్వామి, ముంతాజ్ ఎన్నికయ్యారు.

విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర-యాడికి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని యాడికి ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి సూచించారు యాడికి మండల పరిధిలోని వేములపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారము చేయాలని సూచించారు, అదేవిధంగా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, డయల్ 100, దిశ యాప్ మొదలైన వాటిపై అవగాహన కల్పిస్తూ విద్యార్థినిలకు ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు, అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరిగిన తమకు సమాచారం ఇవ్వాలని, వివరాలు చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని పేర్కొన్నారు, మహిళలు మరియు బాలికల రక్షణపై ఉన్న చట్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డయల్ 100 మరియు సైబర్ నేరం జరిగితే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి ఫోన్ చేసే విధానం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామాంజనేయులు, పోలీస్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2

విశాలాంధ్ర - అనంతపురం : నటీనటుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరంవలె 2023 సంవత్సరానికిగానూ ఇటీవలే టాలీవుడ్ ప్రముఖ తారలు, బుల్లితెర నటీనటుల మధ్య అంగరంగ వైభవంగా జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ ఉత్సవాన్ని నిర్వహించింది. మెగా ఈవెంట్ పార్ట్-2ను ఈ నెల 5వ తేదీన మీముందుకు తెచ్చేందుకు సిద్ధమైందనీ సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఆకట్టుకునే ప్రదర్శనలు, హృదయాన్ని తాకే క్షణాలు, మరపురాని అనుభవాలతో ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ గ్రాండ్ ఎంట్రీతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ అయిన ప్రదీప్ మాచిరాజు-రష్మీ గౌతమ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారన్నారు. నేచురల్ హీరో నాని రాకతో కార్యక్రమం మరింత సరదాగా మారింది. ప్రముఖ యాంకర్ సుమ, రాజీవ్ కనకాల తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని ఈ అవార్డు వేదికపైనే జరుపుకున్నారన్నారు. ఉత్తమ యాంకర్, ఎవర్ గ్రీన్ కపుల్, పాపులర్ మేల్ ఫేస్ వంటి అవార్డులతో పాటు మరిన్ని అవార్డులతో నటీనటులను సత్కరించింది జీ తెలుగు. సరదాగా సాగిన ఈ కార్యక్రమానికి బుల్లితెర నటీనటులతోపాటు టాలీవుడ్ తారలు, ప్రముఖులు హాజరై మరింత కళను జోడించారు. నవంబర్ 5న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో ప్రసారమయ్యే జీ కుటుంబం అవార్డ్స్ పార్ట్-2లో నైట్ ఆఫ్ గ్లిట్జ్ అండ్ గ్లామర్ ను సెలబ్రేట్ చేసుకుంది. అంగరంగ వైభవంగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ తారలు సంయుక్త మీనన్, సుహాస్, పాయల్ రాజ్పుత్, తరుణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ కి ఎంపికైన మిట్స్ ప్రొఫెసర్

విశాలాంధ్ర -జెఎన్‌టియుఏ: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె కళాశాల ముగ్గురు ఆచార్యులు 2023 సంవత్సరానికి గానూ స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ప్రపంచంలోని టాప్ 2% సైంటిస్టుల జాబితాలో ఉన్నారు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ శివయ్య పి. మెహర్ కుల్కర్ని, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగము కు చెందిన దిలీప్ జి లకు ఈ ఘనత లభించిందని ఆయన అన్నారు. పరిశోధన రంగంలో చేసిన కృషికిగాను ఈ ఘనత సాధిం చారు. ఈ అధ్యాపకులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

విశాలాంధ్ర-కణేకల్లు: తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి స్కిల్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు అయిన సందర్భంగా కనేకల్ కేంద్రంలోని అర్, టి సి.బస్టాండ్ లో, మెయిన్ బజార్ లో బాణా సంచా కాల్చి, కనేకల్ ప్రభుత్వ వైద్యశాలలో, కనేకల్ క్రాస్ ఆడిట్ హాస్పిటల్ లో అనారోగ్యంతో మంచం మీద ఉన్న పేషెంట్స్ కు, పండ్లు, బ్రెడ్లు, పంచి ఆనందాన్ని తెదేపా నాయకులు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయండి

విశాలాంధ్ర-తాడిపత్రి: రైతులు తీసుకున్న రుణాలు అన్నిటిని మాఫీచేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బుధవారము పెద్దపప్పూరు మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఖరీఫ్ సీజన్లో వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, జొన్న, సద్ద, కొర్ర తదితర వాణిజ్య, ఆహార పంటలు సాగు చేశారు.కానీ సకాలంలో వర్షాలు లేక పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయి. బోరు బావులు ఉన్న రైతులు కరెంటు కష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులలో రబీలో పప్పు శనగ పంట సాగు చేయడానికి కష్ట తరంగా ఉందన్నారు. కావున జిల్లాలోని 31 మండలాలను కరువు మండలముగా ప్రకటించాలని, నష్ట పోయిన ప్రతి రైతుకు పంట నష్ట పరిహారము అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి విటి.రామాంజనేయులు, సిపిఐ తాడిపత్రి మండల కార్యదర్శి నాగ రంగయ్య పాల్గొన్నారు.

పెళ్లి కాదని యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-శెట్టూరు: మండలం కైరేవు గ్రామానికి చెందిన మాల అభిషేక్(21) అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో బాత్రూంలో ఇనుప కడ్డీకి ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గత కొన్ని నెలల నుంచి తన ముఖముపై మొటిమలు రావడంతో మొటిమల కోసం ట్రీట్మెంట్ తీసుకున్నాడని, అయితే మొటిమలు నయం కాకపోవడంతో తనను ఎవరూ పెళ్లి చేసుకోరని ఉద్దేశంతో తన ఇంట్లో తల్లిదండ్రులు పొలం పనుల నిమిత్తం పొలం కు పోయి ఉండగా ఇంటి నందు ఎవరు లేని సమయంలో తనకు మొటిమలు నయం కానందున తనను ఎవరు పెళ్లి చేసుకోరని మనస్తాపం చెంది బాత్రూం లో పై కప్పుకు గల ఇనుప పైపుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మృతుడి తండ్రి మాల మల్లికార్జున(50) తండ్రి లేట్ మైలారప్ప ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బివి. ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-గుడిబండ: రాష్ట్ర విభజన అనంతరం ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తీసుకురావడానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఏ సుధాకర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరుతూ తన స్వగ్రామంలో కరికెర గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి అలాగే మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజా ఆశీస్సులు కోసం కాంగ్రెస్ ముందడుగు కార్యక్రమం ప్రారంభించారు.ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజా ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా గుడిబండ మండల పరిధిలోని కరికెర,దాస రపల్లి,దాసరపల్లి గొల్లహట్టి,కెఎన్ పల్లి చిగతుర్పి గ్రామలలో బుధవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వరదరాజులు,ఏ.టీ. శివకుమార్,జయరామ్ రెడ్డి, గోవర్ధన్,రామలింగప్ప,మంజునాథ్,రంగస్వామి, మడకశిర రామాంజనేయులు, రామకృష్ణ,నాచేపల్లిరాజశేఖర్, దీన్నేహట్టి దుమానప్ప,రం గనాథ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జలచౌర్యమును అరికట్టండి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో హెచ్చెల్సీ సాగునీటిని నాన్‌ఆయకట్టుదారులు మోటార్లు పెట్టుకుని జలచౌర్యానికి పాల్పడుతున్నారని దాన్ని అరికట్టాలని గోవిందవాడ, బొల్లనగుడ్డం, కళ్లు హొళ గ్రామాల రైతులు కణేకల్లు హెచ్చెల్సీ డీఈ మద్దిలేటిని కోరారు. బుధవారం దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 9వ బ్రాంచ్ కాలవపరిధిలో పర్యటించారు. డిసెంబరు వరకు హెచ్చెల్సీ సాగునీటిని ఇవ్వాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడంలేదని నీరు అందకుండా పైభాగంలో ఉన్న కొందరు మోటార్లు పెట్టుకుని జలచౌర్యానికి పాల్పడుతున్నారని రైతులు అతనితో అన్నారు. మోటార్లు పెట్టి నీరు వాడుకోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడంలేదని రైతులు అన్నారు. దీంతో జలచౌర్యానికి పాల్పడేవారి మోటార్లను తొలగిస్తామని డీఈ మద్దిలేటి అన్నారు. ఉన్ననీటితోనే సర్దుకోవాలని డీ ఈ సూచించారు.

గ్రామ సచివాలయం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండల కేంద్రంలోని సచివాలయం-1ను మండల ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. ముఖ్యంగా హౌసింగ్ లబ్ధిదారులతో ముఖాముఖీ గా మాట్లాడి త్వరగా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. పనులు చేసుకొన్నా లబ్దిదారులకు నిధులు మంజూరు అయ్యాయా లేదా అని వాకబు చేసి సంతృప్తి ని వ్యక్తం చేశారు. అదేవిధ ముగా బాసాపురం లే ఔట్ ను సందర్శించి వివిధ దశలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయమునందు మండల స్థాయి అధికారులతోను మరియు సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందితోను ప్రత్యేక సమావేశము ఏర్పాటు చేసి మండలము నందు జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ తో టిడిపి శ్రేణులు పూజలు

విశాలాంధ్ర- అనంతపురం: మాజీ సీఎం నారా చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ జారీ చేయడంతో టీడీపీ శ్రేణులు ఆనందంలో మునిగిపోయారు. బుధవారం ఉదయం రుద్రంపేటలోని అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు రుద్రంపేట పంచాయతీలో నిజాంపేట్ లో ఉన్న రామాలయం గుడి లో సీతారాములు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బెయిల్ పై విడుదల కావడంతో జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ సతేష్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ గోపాల్ గౌడ్, రుద్రంపేట అధ్యక్షుడు ఎస్ఎం భాష, యూనిట్ ఇంచార్జ్ బోయపాటి బాలప్ప, కుమార్ నాయుడు, నెట్టెం కొండయ్య, జూటూరు వెంకటేష్, వడ్డే మురళి ,గంగవరం అంజి, ఉప్పర శ్రీనివాసులు, ఉప్పర పుల్లన్న, గుత్తా వెంకటేష్, జూటూరు నాగ గంగవరం శివ, చెరుకూరు సుధాకర్ , బేల్దారి నారాయణస్వామి,రాము నాయక్, ఉప్పర మహేష్,మహిళలు కార్యకర్తలు బోయపాటి అరుంధతి, సుజాత, బండిఆదిలక్ష్మి,కాంతమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.